దిగుమతి భారం వద్దు

బడ్జెట్‌లో సుంకాల్ని తగ్గించాలి • బంగారం, కట్-పాలిష్డ్ వజ్రాలపై జీజేఈసీ డిమాండ్

ముంబై/న్యూఢిల్లీ, జనవరి 22: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను కేంద్ర ప్రభుత్వం నూతన బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటంతో ఆయా రంగాల నుంచి డిమాండ్లు, విజ్ఞప్తులు, ప్రతిపాదనలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే రత్నాలు-ఆభరణాల ఎగుమతి, ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) బంగారం, కట్ చేసిన-సానబెట్టిన వజ్రాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కోరుతున్నది. బంగారం, వజ్రాలు, వెండి, రంగు రాళ్ల వంటి ముడి సరకుల దిగుమతులపైనే భారతీయ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ ఆధారపడి ఉన్నదని, కాబట్టి అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ రంగం నిలదొక్కుకోవాలంటే సుంకాల భారం తగ్గాల్సిన అవసరం ఉందంటున్నది. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రకటించనున్నారు.

11 శాతం తగ్గాలి

ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకున్న విలువైన లోహాలపై ప్రస్తుతం 15 శాతం సుంకం పడుతున్నది. దాన్ని 4 శాతానికి దించాలని జీజేఈపీసీ విజ్ఞప్తి చేస్తున్నది. అలాగే కట్-పాలిష్డ్ డైమండ్స్‌పై కూడా 5 శాతం నుంచి 2.5 శాతానికి కస్టమ్స్ సుంకాన్ని తగ్గించాలని కోరుతున్నది. అధిక సుంకం వల్ల దేశీయ ఎగుమతులు తగ్గిపోతున్నాయని, ఉద్యోగ-ఉపాధి కల్పన కూడా పడిపోతున్నదని అవి పెరగాలంటే సుంకాల భారం దిగాలని చెప్తున్నది. ముఖ్యంగా చైనా, థాయిలాండ్ వంటి దేశాల నుంచి గ్లోబల్ మార్కెట్‌లో నెలకొంటున్న పోటీలో నిలబడాలంటే సుంకాల తగ్గింపు ప్రధానమని జీజేఈపీసీ పేర్కొంటున్నది. కాగా, కునారిల్లుతున్న దేశీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా డైమండ్ ఎగుమతిదారులకు తిరిగి వెలుగుల్నిచ్చేలా డైమండ్ ఇంప్రెస్ట్ లైసెన్స్‌ను మళ్లీ తీసుకురావాలని కూడా ఈ సందర్భంగా కేంద్రానికి జీజేఈపీసీ సూచిస్తున్నది. అలాగే ఎన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్న స్పెషల్ నోటిఫైడ్ జోన్లలో ముడి వజ్రాల అమ్మకం ప్రతిపాదననూ అమల్లోకి తేవాలంటున్నది. భారత్-యూఏఈ సీఈపీఏ నుంచి ప్రయోజనాలను పెంచాలని, 'రేట్స్ అండ్ ట్యాక్సెస్ రిఫండ్' వంటి విధానాన్ని ఆచరణలో పెట్టాలని జీజేఈపీసీ చైర్మన్ విపుల్ షా కోరుతున్నారు.

స్మార్ట్‌ఫోన్ విడిభాగాలపై..

దేశీయంగా స్మార్ట్‌ఫోన్ల తయారీలో వినియోగిస్తున్న విదేశీ విడిభాగాలపై రాబోయే బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని తగ్గించవద్దంటూ గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) కోరుతున్నది. ప్రస్తుతం అమల్లో ఉన్న సుంకాలు సరైన విధంగానే ఉన్నాయని, ఈ సమయంలో సుంకాల తగ్గింపు.. స్థానిక తయారీదారులకు ఇబ్బందికరంగా మారుతుందని వివరిస్తున్నది. ఈ మేరకు సోమవారం ఓ నివేదికను జీటీఆర్ఐ విడుదల చేసింది. వేగంగా విస్తరిస్తున్న భారతీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో పరిశ్రమ వృద్ధి, దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలని హితవు పలికింది. 'ప్రస్తుతం భారత్‌లో తయారవుతున్న స్మార్ట్‌ఫోన్ల కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఆయా ఎలక్ట్రానిక్ విడిభాగాలపై 7.5 శాతం నుంచి 10 శాతం వరకు సుంకాలు పడుతున్నాయి. వీటిని ఇలాగే కొనసాగించాలి. తగ్గిస్తే దేశీయ తయారీదారుల వ్యాపారం దెబ్బ తింటుంది' అని జీటీఆర్ఐ తమ రిపోర్టులో పేర్కొన్నది. అయితే ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ).. మొబైల్ ఫోన్ విడిభాగాలపై దిగుమతి సుంకాలను తగ్గిస్తే దేశీయంగా స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి 28 శాతం పెరిగి 82 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంటున్నది. స్వదేశీ తయారీకి, ఎగుమతులకూ ఉత్సాహాన్నిస్తుందని చెప్తున్నది.

పేపర్‌పై పెంచాలి..

విదేశాల నుంచి దేశంలోకి దిగుమతి అవుతున్న పేపర్ ఉత్పత్తులపై సుంకాన్ని 25 శాతానికి పెంచాలని భారతీయ పేపర్, పేపర్‌బోర్డ్ తయారీదారులు డిమాండ్ చేస్తున్నారు. దిగుమతి సుంకాలు తక్కువగా ఉండటం వల్ల దేశంలోకి ఆయా దేశాల నుంచి నాసిరకం ఉత్పత్తులు వస్తున్నాయని ఇండియన్ పేపర్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఎంఏ) ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఈ క్రమంలోనే రాబోయే బడ్జెట్‌లో ప్రస్తుతం 10 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 25 శాతానికి పెంచాలని కోరుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో పేపర్, పేపర్ బోర్డ్ దిగుమతులు 43 శాతం పెరిగాయని, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే సమయంలో 25 శాతం వృద్ధే ఉన్నట్టు ఐపీఎంఏ అధ్యక్షుడు పవన్ అగర్వాల్ గుర్తుచేస్తున్నారు. కాబట్టి దిగుమతి సుంకాలు పెరగాల్సిన అవసరం ఉందని, అప్పుడే దేశీయ పరిశ్రమ నిలబడుతుందని అంటున్నారు.

అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుటుంబ సభ్యులు. చిత్రంలో సచిన్ టెండూల్కర్

క్రెడిట్ కార్డుల బకాయిలు 2.4 లక్షల కోట్లు

ఆందోళన వ్యక్తం చేసిన రిజర్వుబ్యాంక్

న్యూఢిల్లీ, జనవరి 22: రిటైల్ రుణాల్లో అన్నింటికన్నా, క్రెడిట్ కార్డుల బకాయిలు ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోతున్నాయి. ఎటువంటి సెక్యూరిటీలేని ఇటువంటి రుణ బకాయిల పెరుగుదలపట్ల రిజర్వ్‌బ్యాంక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 'రిటైల్ విభాగంలో రుణ వృద్ధి:రిస్క్, స్థిరత్వ ఆందోళనలు' అనే అంశంపై ఆర్బీఐ ఎకానమిస్టులు ఒక రీసెర్చ్ నోట్‌ను విడుదల చేస్తూ 2023 నవంబర్ చివరినాటికి క్రెడిట్ కార్డ్ రుణ బకాయిలు రూ. 2.4 లక్షల కోట్లకు చేరినట్టు వెల్లడించారు. ఈ బకాయిలు మొత్తం రిటైల్ రుణాల్లో 5 శాతం. ఒక ఏడాదిలో ఇవి 34 శాతం పెరిగిపోయాయన్నారు. ఇందులో అధిక శాతం ఆర్థికంగా బలహీనస్థితిలో (సబ్ ప్రైమ్)లో ఉన్న వినియోగదారులవే ఉన్నాయని, వీటి సగటు బకాయి పరిమాణం రూ. 40,000కాగా, అంతకంటే కాస్త మెరుగైన (నియర్ ప్రైమ్)వారి సగటు బకాయి పరిమాణం రూ.60,000 వరకూ ఉన్నట్టు రీసెర్చ్ నోట్ వెల్లడించింది. సబ్‌ప్రైమ్ ఖాతాదారుల బకాయిలే ఎక్కువగా ఉండటం.. రిస్కీ వినియోగదారుల చెంతకే అధిక రుణం ప్రవహిస్తున్నదనడానికి నిదర్శనమని ఎకానమిస్టులు పేర్కొన్నారు. అన్‌సెక్యూర్డ్ రుణాలపై బ్యాంక్‌ల రిస్క్ వెయిటేజీని రిజర్వ్‌బ్యాంక్ పెంచినప్పటికీ, క్రెడిట్ కార్డు రుణాలు పెరుగుతూనే ఉన్నాయన్నారు.

పరిమితి పెట్టాలి

క్రెడిట్ కార్డు రుణాలు, రుణ బకాయిలు పెరుగుతున్న నేపథ్యంలో రిస్క్‌లను తగ్గించుకోవడానికి క్రెడిట్‌కార్డు జారీ సంస్థలు టెక్నాలజీని, అకౌంట్ అగ్రిగేటర్లను ఉపయోగించుకోవడం, పటిష్ఠమైన అండర్‌రైటింగ్ తదితరాల్ని ఆర్బీఐ ప్రోత్సహిస్తున్నదని రీసెర్చ్ నోట్ పేర్కొంది. మరికొన్ని ఇతర చర్యలతో కూడా రిస్క్ తగ్గుతుందని, ముఖ్యంగా కొంత మంది రుణగ్రహీతలకు లేదా కొన్ని రకాల రుణ వినియోగాలకు పరిమితులు విధించాలని సూచించింది. ఆదాయానికి తగ్గ రుణ సదుపాయం లభించేలా డెట్-టు-ఇన్‌కం (డీటీఐ), పరిమితి, లోన్-టు-వాల్యూ (ఎల్‌టీవీ) వంటి పరిమితులు సమర్థవంతంగా ఉంటాయన్నది.

అయోధ్యలో ఐహెచ్‌సీఎల్ హోటల్

ముంబై, జనవరి 22: టాటా గ్రూపునకు చెందిన ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్..తాజాగా అయోధ్యలో మరో హోటల్‌ను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించింది. 1.3 ఎకరాల స్థలంలో సెలెక్షన్స్ హోటల్ పేరుతో సరికొత్తగా హోటల్‌ను నిర్మించబోతున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో పునీత్ ఛత్వాల్ తెలిపారు. అయోధ్యలో రామ్ జన్మభూమి మందిర్ ప్రారంభం కావడంతో పర్యాటక ప్రాంతంగా విరజిల్లే అవకాశం ఉన్నదని, దీంతో ఇక్కడ సరికొత్త హోటల్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటికే సంస్థ.. వివంత, జింజర్ బ్రాండ్స్ అయోధ్యలో హోటళ్లను ఏర్పాటు చేయబోతున్న విషయం తెలిసిందే.

అయోధ్యకు స్పైస్‌జెట్ చార్జి రూ.1,622

• పలు నగరాల నుంచి..

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్‌జెట్..అయోధ్యను సందర్శించేవారికి ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొన్ని రూట్ల నుంచి అయోధ్యకు విమాన టికెట్ ధరను రూ.1,622గా నిర్ణయించింది. ఈ నెల 28 లోపు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 30 లోగా ప్రయణించాల్సి ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఈ ప్రత్యేక ఆఫర్ ఎంపిక చేసిన దేశీయ రూట్లకు మాత్రమే వర్తించనున్నదని, డైరెక్ట్ వన్-వే ఫ్లైట్స్‌కు పనిచేయనున్నదని తెలిపింది. లిమిటెడ్ సీట్లు మాత్రమే ఉన్నాయని, ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి లభించనున్నాయని పేర్కొంది. గ్రూపు బుకింగ్‌లు, ప్రత్యేక బుకింగ్‌లకు ఈ ఆఫర్ వర్తించనున్నది. మరోవైపు, వచ్చే నెల 1 నుంచి అయోధ్యకు చెన్నై, అహ్మదాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, జైపూర్, పాట్నాల నుంచి విమాన సర్వీసులను ఆరంభించబోతున్నది.

కాల్గేట్-పామోలివ్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, జనవరి 22: దేశీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజాల్లో ఒకటైన కాల్గేట్-పామోలివ్ ఇండియా రూ.330.11 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.243.24 కోట్ల లాభంతో పోలిస్తే 35.71 శాతం పెరిగినట్లు వెల్లడించింది. విక్రయాలు 8.21 శాతం అధికమై రూ.1,386.41 కోట్లకు చేరుకున్నాయి. నిర్వహణ ఖర్చులు రూ.970 కోట్లకు తగ్గినట్టు పేర్కొంది.

సిప్లా లాభంలో 32 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 22: ఫార్మాస్యూటికల్స్ దిగ్గజాల్లో ఒకటైన సిప్లా లిమిటెడ్ గత త్రైమాసిక లాభంలో 32 శాతం వృద్ధి నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.801 కోట్లుగా ఉన్న కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం గత త్రైమాసికానికిగాను రూ.1,068.41 కోట్లు ఆర్జించినట్లు వెల్లడించింది. కన్సాలిడేటెడ్ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 13.66 శాతం ఎగబాకి రూ.6,603.81 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. గతేడాది ఇది రూ. 5,810.09 కోట్లుగా ఉన్నది. నిర్వహణ ఖర్చులు రూ.5,119.81 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో ఉమాంగ్ వోహ్రా మాట్లాడుతూ..గత త్రైమాసికంలో టాప్‌లైన్ వృద్ధి 14 శాతంగా నమోదైందన్నారు. భారత్‌లో కంపెనీ వ్యాపారం 12 శాతం వృద్ధిని సాధించగా, బ్రాండెడ్ ప్రిస్క్రిప్షన్, ట్రేడ్ జనరిక్స్, కన్జ్యూమర్ హెల్త్ ఆశాజనక పనితీరు కనబరిచినట్లు చెప్పారు. గత త్రైమాసికంలో ఫార్మాస్యూటికల్స్ నుంచి రూ. 6,365 కోట్ల ఆదాయం లభించింది.

స్పందన స్ఫూర్తి లాభం 127 కోట్లు

ముంబై, జనవరి 22: హైదరాబాద్‌కు చెందిన సూక్ష్మ రుణాలు అందించే స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.127 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 79 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 75 శాతం అధికమై రూ.657 కోట్లకు చేరుకున్నది. ఏడాది క్రితం ఇది రూ.375 కోట్లుగా ఉన్నది. నికర వడ్డీ ఆదాయం 60 శాతం ఎగబాకి రూ.407 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. మొండి బకాయిలు 5.31 శాతం నుంచి 1.51 శాతానికి తగ్గాయి.

ఎఫ్‌పీఐలు యూటర్న్

జనవరిలో రూ.13 వేల కోట్ల నిధులు వెనక్కి



న్యూఢిల్లీ, జనవరి 22: దేశీయ ఈక్విటీ మార్కెట్లపై ఉత్సుకతను ప్రదర్శించిన విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు యూటర్న్ తీసుకున్నారు. గత కొన్ని నెలలుగా భారీగా నిధులు కుమ్మరించిన ఎఫ్ఐఐలు..ప్రస్తుత నెలల ఏకంగా వేలాది కోట్ల నిధులను తరలించుకుపోయారు. అమెరికా బాండ్ ఈల్డ్స్ పెంచడంతో ఈ నెలలో ఇప్పటి వరకు ఎఫ్ఐఐలు రూ.13,047 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈక్విటీ మార్కెట్ల నుంచి వేలాది కోట్ల రూపాయలను తరలించుకుపోయిన ఎఫ్ఐఐలు..డెబిట్ మార్కెట్లో మాత్రం పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ నెల 1 నుంచి 19 వరకు ఎఫ్ఐఐలు డెబిట్ మార్కెట్లో రూ.15,647 కోట్ల నిధులు కుమ్మరించారు. డిసెంబర్ నెలలో రూ.66,134 కోట్ల నిధులు కుమ్మరించిన ఎఫ్ఐఐలు..అంతకుముందు నెల నవంబర్‌లోనూ రూ.9 వేల కోట్లు చొప్పించారు. మరోవైపు డిసెంబర్‌లో డెబిట్ మార్కెట్లోకి రూ.18,302 కోట్లు, నవంబర్‌లో రూ.14,860 కోట్లు, అక్టోబర్‌లో రూ.6,381 కోట్ల చొప్పున పెట్టుబడులు పెట్టారు. మొత్తం మీద 2023లో ఎఫ్ఐఐలు ఈక్విటీ మార్కెట్లోకి రూ.1.71 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టగా..డెబిట్ మార్కెట్లోకి రూ.68,663 కోట్ల నిధులను చొప్పించారు.

2022లోనూ 1.21 లక్షల కోట్లు వెనక్కి

2022లో ఎఫ్ఐఐలు చుక్కలు చూపించారు. అంతర్జాతీయంగా పలు సెంట్రల్ బ్యాంక్‌లు కీలక వడ్డీరేట్లను పెంచడంతో 2022లో ఎఫ్ఐఐలు ఏకంగా రూ.1.21 లక్షల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. మరోవైపు, గరిష్ఠ స్థాయికి చేరుకున్న సూచీల్లో ప్రాఫిట్ బుకింగ్ జరగడం సర్వసాధారణమని, వడ్డీరేట్లలో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో ఎఫ్ఐఐలు వేచిచూసే దోరణిలో ఉన్నారని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇతర మార్కెట్ల కంటే భారత్ సూచీలు అంచనాలకుమించి రాణిస్తున్నప్పటికీ ప్రస్తుతం దిద్దుబాటు దోరణిలో ఉన్నాయని పేర్కొన్నారు. భారత్‌తో పాటు తైవాన్, దక్షిణ కొరియా, హాంకాంగ్ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు భారీగా నిధులను ఉపసంహరించుకుంటున్నారు.

అమెరికా బాండ్ ఈల్డ్స్ రేటు 3.9 శాతం నుంచి 4.15 శాతానికి పెంచడం వల్లనే ఎఫ్ఐఐలు తమ నిధులను తరలించుకుపోయారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ఎఫ్ఐఐలను అమ్మకాలవైపు నడిపించాయి.

- వీకే విజయ కుమార్, జియోజిట్ ఫైనాన్షియల్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారి

పెరగనున్న టాటా వాహన ధరలు

న్యూఢిల్లీ, జనవరి 22: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్..ప్యాసింజర్ వాహన ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. వచ్చే నెల నుంచి అందుబాటులోకి వచ్చేలా అన్ని రకాల ప్యాసింజర్ వాహన ధరలను సరాసరిగా 0.7 శాతం సవరిస్తున్నట్లు వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతో ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది. ప్రస్తుతం సంస్థ పంచ్, నెక్సాన్, హారియర్ మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

వికాస్ లైఫ్‌కేర్ చేతికి దుబాయ్ సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 22: వికాస్ లైఫ్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్..దుబాయ్‌కు చెందిన స్కై 2.0లో మెజార్టీ వాటాను కొనుగోలు చేసింది. 79 మిలియన్ డాలర్లతో 60 శాతం వాటాను కొనుగోలు చేయబోతున్నది. మన కరెన్సీలో ఇది రూ.650 కోట్లకు పైమాటే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ ఒప్పందం పూర్తికానున్నదని సంస్థ స్టాక్ మార్కెట్లకు సమాచారం అందించింది.

ఐపీవోలతో దెబ్బే

మదుపరులకు మిగులుతున్నది నష్టాలే • వైకే2 పార్ట్‌నర్స్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)లు వస్తున్న మార్కెట్లలో భారత్‌దే అగ్రస్థానం ఇప్పుడు. గడిచిన ఏడాది కాలంలో చైనా, జపాన్ దేశాల్లో కలిసి నమోదైన ఐపీవోల కంటే కేవలం భారత్‌లో వచ్చినవే ఎక్కువగా ఉండటాన్నిబట్టి ఇక్కడ పబ్లిక్ ఇష్యూ రష్ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అయితే చరిత్ర మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నది. ఎంత ఉత్సాహంగా ఐపీవోలు వస్తున్నాయో.. వాటి పెర్ఫార్మెన్స్ మాత్రం అంత నిరుత్సాహకరంగా ఉంటున్నది మరి.

స్వల్పకాలిక మదుపే..

ఐపీవోలపట్ల ఆసక్తి కనబరుస్తున్న మదుపరులు.. ఎంతోకాలం ఆయా సంస్థలతో కొనసాగడం లేదు. ఫలితంగా ఆయా షేర్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. దేశీయ పబ్లిక్ మార్కెట్లలో మాత్రమే పెట్టుబడి పెడుతున్న బొటిక్ సంస్థ వైకే2 పార్ట్‌నర్స్ వివరాల ప్రకారం 2004లో పెట్టుబడిగా పెట్టిన ప్రతీ 100 రూపాయలు.. 2014లో రూ.72కు పడిపోయింది. సగటున ప్రతీ ఐపీవో ఏటా మైనస్ 3.5 శాతం నష్టాన్నిచ్చినట్టు సంస్థ చెప్తున్నది. ఇందుకు మేనేజ్‌మెంట్లు, ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్లు, యాంకర్ ఇన్వెస్టర్లు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు, మీడియా, దేశ-విదేశీ పరిస్థితులు, రెగ్యులేటర్లు అన్నీ కారణమేనని తమ నోట్‌లో వైకే2 సహ వ్యవస్థాపకులు అరుణ్ అగర్వాల్, వినోద్ నాయర్ పేర్కొన్నారు. దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు ఎక్కువగా ఉండట్లేదంటున్నారు. గత పదేండ్లకుపైగా కాలం లో ఎన్ఎస్ఈ500 ఇండెక్స్‌లోని దాదాపు 77 శాతం సూచీలు ఇన్వెస్టర్లకు నిరాశనే మిగిల్చాయి.

సెబీ దృష్టి పెట్టాలి

ఐపీవోకు వస్తున్న సంస్థలు స్టాక్ మార్కెట్లలో నిలదొక్కుకునేందుకు సెబీ తన పరిధిలో కృషి చేయాల్సిన అవసరం ఉందని వైకే2 అంటున్నది. అప్పుడే దీర్ఘకాలిక సంపద సృష్టి సాధ్యమవుతుందని అభిప్రాయపడుతున్నది. ఐపీవో ఇన్వెస్టర్లందరికీ ఏడాదిపాటు లాకిన్ పీరియడ్ పెట్టాలని సూచిస్తున్నది. అప్పుడే ఫండమెంటల్స్ ఆధారంగా ట్రేడింగ్ జరుగుతుందని, లేనిపోని ఆకర్షణల ప్రభావం ఉండబోదంటున్నది.

జేహ్ ఏరోస్పేస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఏరోస్పేస్ అభివృద్ధికి కృషి

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి • జేహ్ ఏరోస్పేస్ సంస్థ ప్రారంభం

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్టు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎరోస్పేస్ ఉత్పత్తుల తయారీకి అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తామని భరోసా ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరులోని జేసీకే హారిజాన్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన జేహ్ ఏరోస్పేస్ సంస్థను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు. స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆ సంస్థను కోరారు. ఈ సందర్భంగా స్టార్టప్ ఎండీ విశాల్ సింఘ్వీ మాట్లాడుతూ..రూ.23 కోట్ల పెట్టుబడితో ఈ ఏరోస్పేస్ సెంటర్‌ను ప్రారంభించామని, రానున్న నాలుగు నెలల్లో 100 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇక్కడ తయారైన ఏరోస్పేస్ విడిభాగాలను అమెరికా ఎగుమతి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

రాష్ర్టానికి దిగ్గజ ఫుడ్ ఇండస్ట్రీ

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో దాదాపు రూ.40 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎనర్జీ, ఐటీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తదితర రంగాలకు చెందిన పలు పరిశ్రమలు ముందుకొచ్చాయని శ్రీధర్‌బాబు తెలిపారు. సౌదీ అరేబియాకు చెందిన ఓ దిగ్గజ ఆహార పరిశ్రమ తెలంగాణలో భారీ సంఖ్యలో రెస్టారెంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్టు చెప్పారు.

జీ-సోనీ విలీనం రద్దు

నిలిచిపోయిన రూ.83 వేల కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ, జనవరి 22: అంతర్జాతీయ ఎంటర్‌టైన్‌మెంట్ దిగ్గజం సోనీ గ్రూప్ కార్పొరేషన్.. జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో విలీన ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. సోనీ గ్రూప్ తన ఇండియా యూనిట్‌ను జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో విలీనం చేసి, 10 బిలియన్ డాలర్ల (రూ.83,000 కోట్లు) విలువైన మెగా వినోద సంస్థను ఆవిర్భవింపచేసేందుకు రెండేండ్ల క్రితం సోనీ గ్రూప్ డీల్ కుదుర్చుకుంది. ఈ డీల్‌ను రద్దుపర్చుకుంటూ జీకి తాజాగా సోనీ కార్పొరేషన్‌కు చెందిన సబ్సిడరీ సోనీ ఫిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా (ప్రస్తుత పేరు కల్వర్ మాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్) టర్మినేషన్ నోటీసు జారీచేసింది విలీన ఒప్పందంలోని నిబంధనల్ని ఉల్లంఘించినందుకు 90 మిలియన్ డాలర్ల (రూ.747 కోట్లు) బ్రేకప్ ఫీజు చెల్లించాలంటూ ఆ నోటీసులో జీ గ్రూప్‌ను డిమాండ్ చేసింది. ఈ డీల్ పూర్తయితే 70కిపైగా టీవీ చానళ్లు, రెండు బాలీవుడ్ స్టూడియోలు, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్‌తో పోటీపడే అపారమైన ఫిల్మ్ లైబ్రరీతో కూడిన పెద్ద వినోద దిగ్గజం ఏర్పడేది. విలీనానికి ఎన్సీఎల్టీ, సీసీఐ, స్టాక్ ఎక్స్ఛేంజీలు, రుణదాతలు, షేర్‌హోల్డర్ల నుంచి వివిధ నియంత్రణా పరమైన అనుమతులు కూడా ఇప్పటికే వచ్చాయి. 2021 డిసెంబర్ 22న ప్రకటించిన ఒప్పందం ప్రకారం విలీనం రెండేండ్లలోపు పూర్తికావాల్సి ఉంది. ఆ గడువు ముగిసిన తర్వాత మరో నెల పొడిగించారు. ఈ జనవరి 21తో గడువు ముగిసినప్పటికీ ఒప్పందంలోని షరతులు అమలుకాకపోవడం నిరుత్సాహకరమని సోనీ తెలిపింది. ఇండియాలో తమ ఉనికిని పెంచుకోవడానికి కట్టుబడి ఉన్నట్టు జపాన్‌కు చెందిన సోనీ గ్రూప్ కార్పొరేషన్ ప్రకటించింది.

లీగల్ చర్యలు చేపడతాం:జీ

విలీన ఒప్పందాన్ని రద్దుచేసుకున్నందున ఏర్పడిన పరిణామాల నుంచి తమ భాగస్వాముల దీర్ఘకాలిక ప్రయోజనాల్ని సంరక్షించడానికి తగిన లీగల్ చర్యల్ని చేపడతామని జీ ఎంటర్‌టైన్‌మెంట్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. విలీన ఒప్పందం అమలుకోసం అవసరమైనవన్నీ చేశామని, సోనీ చేసిన ఆరోపణల్ని తిరస్కరిస్తున్నామని వివరించింది. డీల్ రద్దుతో ఇండస్ట్రీస్‌కు చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా లేదా వాల్ట్ డిస్నీతో విలీన అవకాశాల్ని జీ అన్వేషించాల్సి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జీకి ప్రాంతీయ భాషల్లో ఉన్న అపారమైన కంటెంట్, దజన్లకొద్దీ టీవీ చానళ్ల నుంచి సోనీకి ఇక ప్రయోజనం లేనందున, ఈ జపాన్ సంస్థ సైతం భారత్ కార్యకలాపాలపై కొత్త వ్యూహాన్ని రూపొందించుకోవాల్సి ఉంటుంది.

రిస్క్‌లో క్రికెట్ ప్రసార హక్కులు

కొన్ని క్రికెట్ కప్ ఈవెంట్లను టీవీలో ప్రసారం చేసేందుకు డిస్నీ స్టార్‌తో జీ నాలుగేండ్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పంద సమయంలో 1.32-1.44 బిలియన్ డాలర్ల మేర (రూ.12,000 కోట్ల వరకూ) డిస్నీకి జీ చెల్లించాల్సి ఉంటుంది. తాజాగా విలీన ఒప్పందం రద్దుకావడంతో ఈ క్రికెట్ ప్రసార హక్కుల్ని జీ వదులుకునే రిస్క్ ఏర్పడిందని విశ్లేషకులు అంటున్నారు. జీ వద్ద ప్రస్తుతం నగదు నిల్వలు రూ. 600 కోట్ల మేరకే ఉన్నందున, ఈ చెల్లింపుల్ని చేయలేదని చెపుతున్నారు. వాస్తవానికి విలీన సంస్థలో రూ.15,000 కోట్లకుపైగా పెట్టుబడి చేసేందుకు సోనీ ప్రతిపాదించింది.

పునీత్ గోయెంకా వివాదమే కారణం



సోనీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి విలీన సంస్థకు నాయకత్వం వహించేవారిపై ఏర్పడిన వివాదమే కారణమయ్యింది. ప్రస్తుత జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పునీత్ గోయెంకా విలీన కంపెనీ నుంచి వైదొలగాలంటూ సోనీ చేస్తున్న డిమాండ్‌ను జీ ఎంటర్‌టైన్‌మెంట్ తోసిపుచ్చుతున్నది. పునీత్ మార్కెట్లో ఫ్రాడ్స్‌కు పాల్పడ్డాయంటూ వచ్చిన ఆరోపణలపై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ దర్యాప్తు జరుపుతున్న నేపథ్యంలో విలీన కంపెనీ నుంచి దూరంపెట్టాలంటూ సోనీ డిమాండ్ చేస్తున్నది. ఒప్పందం ప్రకారం విలీన సంస్థలో సోనీకి 50.86 శాతం, గోయెంకా కుటుంబానికి 3.99 శాతం వాటా ఉంటుంది. కంపెనీ నుంచి నిధులు మళ్లించారన్న ఆరోపణలతో గోయెంకా ఏ లిస్టెడ్ కంపెనీలోనూ డైరెక్టర్‌గా కొనసాగరాదంటూ గతంలో సెబీ నిషేధం విధించగా, ఈ ఉత్తర్వులపై అప్పిలేట్ ట్రిబ్యునల్ స్టే ఇచ్చింది. జపాన్‌లో కఠినమైన కార్పొరేట్ గవర్నెన్స్ అమలవుతున్నందున, విలీన సంస్థకు గోయెంకా నేతృత్వాన్ని సోనీ ఏ మాత్రం అంగీకరించడం లేదు.